విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 28, మార్చి 2023

వైఎస్సార్ బీమా నగదు అందజేత

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల కేంద్రానికి బెస్తా వీరన్న అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సోమవారం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వైయస్సార్ బీమా ద్వారా తక్షణ సాయం కింద రూ.10 వేలను మృతుడి భార్య వంద్రమ్మ అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపీ సిపి నాయకులు. దేశాయ్ సిద్దార్థ్, విద్యా కమిటీ చైర్మన్ కె గిరిబాబు, కో ఆప్షన్ నెంబర్ లతీఫ్, ఎస్సీ సెల్ నాయకులు సుంకన్న, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ బాషాలు మాట్లాడుతూ సీఎం జగన్ నిరుపేదల సంక్షేమానికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

అక్క చెల్లెమ్మలకు వరం ఆసరా

విశాలాంధ్ర-ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆసరా పథకం పేద మధ్యతరగతి మహిళలకు వరంగా మారిందని ఎమ్మెల్సీ వై. శివరామిరెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండ మండల కార్యాలయం ఆవరణలో 'వైయస్సార్ ఆసరా' వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు తదుపరి 995 మహిళా సంఘాలు,9,995 మంది మహిళలకు 7 కోట్ల 57 లక్షల,47 వేల,009 రూపాయల మెగా చెక్కును మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల మహిళలు, అధికారులు, వైఎస్ఆర్సిపి నాయకులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు,ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎస్‌కు విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆదర్శ పాఠశాల నుండి ఇటీవల జరిగిన జాతీయ ప్రతిభ ఉపకార వేతనా ప్రవేశ పరీక్ష నందు 8 దవ తరగతి చదువుతున్న వారు ఆదర్శ పాఠశాల నుండి ఏడు మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉపకార వేత నానికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వెంకటేశులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుహాన, పూర్ణిమ, రాధిక, వర్షిత, అక్షయ, ముస్తాక్, రంజిత్ లు ఎంపికైనట్లు వారు తెలిపారు. జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్.ఎం.ఎం.ఎస్) నుండి ఎంపికైన విద్యార్థులకు ప్రతి సంవత్సరం 12 వేల రూపాయలు చొప్పున నాలుగు సంవత్సరాలకు గాను 48 వేల రూపాయలు విద్యార్థులకు అందుతాయని వారు పేర్కొన్నారు.

పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-డి.హీరేహాళ్: మండలం పరిధిలోని గొడిసిలపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న దాదాపు 73 మంది విద్యార్థులకు గ్రామ సర్పంచ్ రాళ్ల రామ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో 10 వ తరగతి ప్రతి ఒక్కవిద్యార్థికి ఒక పెన్ను, ఒక పాడ్‌ను సోమవారం అందజేశారు. మండల వైసిపి గ్రామ సచివాలయల కన్వీనర్ రాళ్ళ తిమ్మారెడ్డి తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా మండల సచివాలయల కన్వీనర్ రాళ్ల తిమ్మరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు క్రిష్ణ వేణి, ఉపాధ్యాయులు, పాఠశాల చైర్మన్ బోయ వన్నూరస్వామి, సచివాలయం సంక్షేమ సహాయకులు గౌస్, వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ టీవీల వితరణ

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల పరిధిలోని గడేకల్, విడపనకల్, పాల్తూరు, హావలిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెల్కో సోలార్ లైటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అసిస్టెంట్ మేనేజర్ ప్రకాష్ కుమార్, విడపనకల్ ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్ రెడ్డి మరియు వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలకు ఎల్ఈడి టీవీలు, యుపిఎస్, సోలార్ సిస్టం, ఇతర సామాగ్రిలను డొనేట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఈ సౌకర్యాలు కేవలం కార్పొరేట్ మరియు ప్రైవేట్ పాఠశాలల్లోనే ఎక్కువగా ఏర్పాటు చేసుకోవడం జరుగుతుందని, కానీ ప్రభుత్వ పాఠశాలలో కూడా ఇలాంటి సిస్టమ్స్ ఉండాలన్న ఉద్దేశంతో అందరి సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జడ్పిటిసి హనుమంతు, వైకాపా సీనియర్ నాయకులు కరణం భీమిరెడ్డి, సర్పంచ్ ఉమాశంకర్, స్కూల్ కమిటీ చైర్మన్ రాముడు, ఇతర ఉపాధ్యాయులు బృందం పాల్గొనడం జరిగింది.

పిచ్చి మొక్కలు తొలగింపు

విశాలాంధ్ర-విడపనకల్లు: మండల పరిధిలోని కడదరబెంచి గ్రామంలో ప్రధాన రహదారులు పలు కాలనీలోని పెరిగిన పిచ్చి మొక్కలను సోమవారం గ్రామ సర్పంచ్ కే.ధనలక్ష్మి, నాయకులు కే. దేవరాజ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కలను తొలగించడం జరిగిందని పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ తెలిపారు.

ఘనంగా సరస్వతీ పూజ

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్ లో సోమవారం సరస్వతి దేవి పూజా కార్యక్రమంను పదవతరగతి చదువు తున్న విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ముందుగా సరస్వతి దేవి చిత్రపటానికి పూల మాలలు వేసి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కరెస్పాండ్ విశ్వనాథ్ మాటా డుతు విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని, పరీక్షలంటే భయపడరాదన్నారు. పట్టుదలతో విద్యను అభ్యసించాలని,ఇష్టంతో చదివే కష్టాన్ని జయించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజన్ హైస్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పదవ తరగతి విద్యార్థులు, పాల్గొన్నారు.

రాహుల్ అనర్హత వేటుపై కాంగ్రెస్ పార్టీ నిరసన

విశాలాంధ్ర-ఉరవకొండ: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ పై అనర్హత వేటుపై సోమవారం ఉరవకొండలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా నాయకులు వడ్ల అంజనేయులు, సోనియా శీనా, చెన్నప్ప మాట్లాడుతూ భారత దేశం కోసం ఎన్నో త్యాగాలను చేసిన రాహుల్ గాంధీ కుటుంబాన్ని నిత్యం అవమానం పరుస్తున్న కేంద్రంలోని అధికార బిజెపి అహంకారంతో, నిరంకుషత్వంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పార్లమెంటులో పారిశ్రామిక వేత ఆదాని చేస్తున్న అక్రమాలపైన, మరియు నరేంద్ర మోడీకి ఆ దానికి ఉన్న సన్నిహిత సంబంధాలపై రాహుల్ గాంధీ గట్టిగా నిలదీయడం జరిగిందని దీనిని జీర్ణించుకోలేని మోడీ ప్రభుత్వం రాహుల్ పై కక్ష సాధింపు చేస్తుందన్నారు. అందులో భాగంగానే అనర్హత వేటు వేసిందన్నారు. ఇది ప్రజాస్వామ్యం పైనే పెద్ద దాడి అని అభివర్ణించారు. ఇలాంటి సంఘటనలను దేశంలోనే ప్రజాస్వామ్యవాదులు అందరు కూడా ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులను దెబ్బతీయడానికి పరువు నష్టం పేరుతోనూ, సిబిఐ, ఈడి లాంటి రాజ్యాంగ సంస్థలను కూడా స్వప్రయోజనాలకు వాడుకుని ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు అబ్బాస్ అమరనాథ్, చెట్ల రాముడు, పోస రాము, సుధాకర్ వివిధ మండలాలకు చెందిన మండల అధ్యక్షులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

104 వాహనాలు ప్రారంభం

విశాలాంధ్ర-అనంతపురం వైద్యం: స్థానిక కలెక్టర్ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదనంగా జిల్లా వైద్యరోగ్య శాఖకు 'మంజూరు చేసిన ఆరు నూతన '104' వాహనాలను సోమవారం అసిస్టెంట్ కలెక్టర్ సూరపాటి ప్రశాంత్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం అక్టోబర్ నందు జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలానికి ఒక వాహనం చొప్పున ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాలో 433 విలేజ్ హెల్త్ క్లినిక్స్ ల కు వాహన కొరత ఏర్పడి నెలకు ఒకసారి మాత్రమే ఈ వాహనాలు విధులకు హాజరయ్యవని, ఇప్పుడు అదనంగా ఆరు వాహనాలు జిల్లా కు కేటాయించడం వల్ల నెలకు రెండు సార్లు గ్రామాలను సందర్శించడం వీలవు తుందన్నారు. జిల్లా ఫ్యామిలీ డాక్టర్ విధానం నోడల్ అధికారి సుజాత, ఆరోగ్య శ్రీ కో- ఆర్డినేటర్ కిరణ్ కుమార్, వైద్యులు నారాయణ స్వామి, అనుపమ జేమ్స్, ఓబులు, త్యాగరాజు,104 మేనేజర్ కృష్ణమూర్తి, వేణుగోపాల్,కిరణ్ పాల్గొన్నారు.

దళిత గిరిజనులపై వివక్షతను విడనాడాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: పాలక పక్షాల వివక్షతతోనే గిరిజన ప్రాంతాలు అణగద్రొక్కపడుతున్నాయని గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్లో ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా సదస్సు నిర్వహించారు. సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాఫర్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి మళ్లించి దళిత గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సబ్ ప్లాన్ నిధులకు చట్టబద్ధత కల్పించే విధంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కోనేరు రంగారావు కమిటీ సిఫార్సులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ సక్రమంగా అమలు చేసేవిధంగా దళిత గిరిజనులు పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. గిరిజన నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని ప్రమోషన్లలో గిరిజనులకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.గిరిజనుల జనాభా ప్రాతిపదికన ఉద్యోగ రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని గిరిజన ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. గిరిజన వాడల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలన్నారు. జీవో నెంబర్ 319 ప్రకారం 2.5 0 ఎకరాల భూమిని ప్రతి గిరిజన కుటుంబానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ప్రభాకర్, ఎపి గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు గోవింద నాయక్, కృష్ణా నాయక్,తిప్పే స్వామి నాయక్ పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభం

విశాలాంధ్ర-ఉరవకొండ: మండలంలోని రాయంపల్లి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని సోమవారం ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వరరెడ్డి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథ కాలు అట్టడుగున ఉన్న పేద వర్గాలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను తెచ్చారన్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలను గ్రామ సర్పంచు సుజాత, ఇతర నాయకులు కార్యకర్తలు,గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు ఎత్తును కుదించడం దుర్మార్గమైన చర్య

ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్ర కుట్రపై సీఎం జగన్ నోరువిప్పాలి

అఖిలపక్షంతో బీజేపీని నిలదీయాలి

రిలే నిరాహార దీక్షలు ప్రారంభించిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: పోలవరం ప్రాజెక్టుకు జాతీయత కల్పించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా ఎత్తును తగ్గించడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ విమర్శించారు. ఆపార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట జిల్లా కార్యదర్శి జాఫర్ , జిల్లా కార్యవర్గ సభ్యులు కేశవ రెడ్డి, రంగయ్య, రమణ, రాజేష్ గౌడ్, సంతోష్ కుమార్, వీభద్రస్వామి, మల్లికార్జున, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుల్లాయ్ స్వామి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్, ఎపి మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్, గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకుడు రామాంజనేయులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ ముఖ్య అతిథిగా హాజరై దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ను మినీ ప్రాజెక్టుగా గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలోనే పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిన సమయంలో సెంట్రల్ వాటర్ కమిషన్ సాంకేతిక నిపుణులు ఆనాడే పూర్తిగా అంచనా వేశారని ప్రాజెక్టు ఎత్తు 156 అడుగులు, నీటి నిల్వ సామర్థ్యం 196 టిఎంసిలు, అందుకు కావలసిన నిధులు 55 వేల కోట్ల నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుందని నివేదించినట్లు గుర్తు చేశారు.ప్రాజెక్టు పనులు ప్రారంభించిన అనంతరం కేంద్ర జలశక్తి మండలి సాంకేతిక నిపుణులు పూర్తి స్థాయిలో అధ్యయనం చేయడం జరిగిందన్నారు. అయితే ప్రాజెక్టు నిర్మాణానికి 20 వేల కోట్ల రూపాయలు మాత్రమే ఇస్తామని పార్లమెంటులో జలశక్తి మండలి మంత్రి ప్రకటించడం దారుణమన్నారు. రాష్ట్రానికి ఇంత అన్యాయం జరుగుతున్నా 31 మంది ఎంపీలు ఉన్న వైసిపి ప్రభుత్వం సీఎం జగన్ మోహన్ రెడ్డి ఏమాత్రం స్పందించకపోవడం దుర్మార్గమని ఘాటైన వ్యాఖ్యలు చేశారు.15 లక్షల ఎకరాలకు సాగు అందించడమే కాకుండా 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడుతూ వేలాది గ్రామాలకు త్రాగునీరు అందించే పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించి కేవలం 92 టిఎంసిల నీరు నిల్వ ఉంచేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంతజరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించక పోవడం బాధాకరమన్నారు. పోలవరం బహుళార్థక ప్రాజెక్టు ఎపి లోని 26 జిల్లాలకు ఉపయోగపడుతుందన్నారు. ప్రాజెక్టు ద్వారా 80 టిఎంసిలు కృష్ణా డెల్టాకు ఇచ్చినట్లైతే కృష్ణా డెల్టాకు ఇచ్చే శ్రీశైలం డ్యాం నీరు ఆదా చేసుకోవచ్చని ఆనీరు రాయలసీమ జిల్లాల్లోని హంద్రీనీవా, గాలేరు నగరి, తెలుగుగంగ ప్రాజెక్టులకు నిఖర జలాలు అందించేందుకు వీలుంటుందని స్పష్టం చేశారు. వీటితో పాటుగా పోలవరం ప్రాజెక్టు నుండి విశాఖకు 24 టిఎంసిల నీరు విడుదల చేసినట్లైతే పారిశ్రామిక అవసరాలకే కాకుండా త్రాగునీటికి ఉపయోగముంటుందని సూచించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గిస్తే ఊరుకునేది లేదని గతంలో నిర్దేశించిన విధంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరగాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తప్పుపడుతున్నామన్నారు.తక్షణమే ఎపి సీఎం జగన్ కేంద్రంపై పోరాడాలని అవసరమైతే అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల బృందాన్ని తీసుకొని వెళ్లాలని సూచించారు. ప్రాజెక్టు నిర్మాణం గతంలో నిర్దేశించిన విధంగా జరగాలని డిమాండ్ చేస్తూ రెండు రోజుల పాటు రాష్ట్ర మంతటా రిలే నిరాహారదీక్షలు చేపట్టామన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పై చొరవ చూపాలని ప్రాజెక్టు నిర్మాణం ఎత్తును, నిధులను తగ్గించకుండా కేంద్రంతో పోరాడాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టును పూర్తి సామ్యంతో నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర మంతటా రెండురోజుల పాటు ఆయా జిల్లా కలెక్టరేట్ల ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పోలవరం ప్రాజెక్టును ప్రారంభిస్తే ఆయన తనయుడు ఎపి సీఎం జగన్ ప్రాజెక్టు ఎత్తును తగ్గించే కుట్రకు వత్తాసు పలుకుతున్నాడని విమర్శించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ అన్యాయం చేస్తున్నాడని మండిపడ్డారు. ప్రాజెక్టు నిర్మాణానికి గతంలో నిర్దేశించిన నిధులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని దుమ్మెత్తి పోశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచైనా సరే పోలవరం ప్రాజెక్టు నిధులు సాధించుకుంటామని సాగు త్రాగు నీటి కోసం రానున్న రోజుల్లో మిలిటెంట్ ఉద్యమాలకు వెనుకాడబోమని సీపీఐ జాఫర్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణ స్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, రామక్రిష్ణ, రంగయ్య, పెద్దయ్య, నగర సహాయ కార్యదర్శి అల్లిపీర, జిల్లా సమితి సభ్యులు రమేష్, రవీంద్ర, రామంజి, నరేష్, జయలక్ష్మి,రామాంజినేయులు, రామక్రిష్ణ, కృష్ణుడు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్: రాయలసీమ అన్నదాతలకు సిపిఐ పార్టీ అండగా నిలుస్తుందని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాలు ఎండగడుతూ కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర పై అప్పర్ భద్ర డ్యామ్ నిర్మిస్తున్న దాన్ని అడ్డుకోవాలని, లేదా రాయలసీమ ప్రజలకు సమాంతర కాలువ ఇవ్వాలని, ఏప్రిల్ నెలలో సిపిఐ, సిపిఎం పార్టీలు బొమ్మనహాల్ సరిహద్దులోని హెచ్ఎల్సీ 105 కిలోమీటర్ల నుండి పాదయాత్ర చేపడుతున్నట్లు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. జగదీష్ పేర్కొన్నారు. సోమవారం బొమ్మనహాళ్లోని హెచ్ఎల్సీ 105 కిలోమీటర్లు వద్ద కాలువను పరిశీలించారు. పాదయాత్రకు శ్రీకారం చుట్టేందుకు ఏ గ్రామం మీద నిర్వహించాలని, దానిపై సిపిఐ నియోజకవర్గ నాయకులతో చర్చించారు. రూట్ మ్యాప్ వేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని విస్మరించాయని, పాదయాత్రతో వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కర్ణాటకలో సాధారణ ఎన్నికల నేపథ్యంలో మరోసారి గెలవాలని ఉద్దేశంతో అప్పల బద్ర ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ రూ.5300 కోట్లు కేటాయించి డ్యాం నిర్మించేందుకు సూచించింది. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోవిందప్ప, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, రాయదుర్గం తాలూకా సిపిఐ కార్యదర్శి నాగార్జున, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజు, కనేకల్ మండల సిపిఐ కార్యదర్శి గౌస్ ఫి రా, సిపిఐ నాయకులు నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ నెంబర్ శాంతరాజు తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ తీర్మానం హర్షనీయం

విశాలాంధ్ర-గుంతకల్లు : ఎస్టీ జాబితాలో చేర్చాలని గత 70 ఏళ్లుగా పోరాటం చేస్తున్న బోయ/వాల్మీకులు ఎక్కువగా రాయలసీ ప్రాంతంలో కర్నూలు, అనంతపురం జిల్లాలో అధిక సంఖ్యలో ఉన్నందున రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బోయ/వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షినీయమని గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకట్రాంరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని వాల్మీకి కళ్యాణ మండపం ఆవరణంలో పట్టణ వాల్మీకి సంఘం నాయకులు సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో ముఖ్య అతిథులు ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ భవాని ,ఎంపీపీ బివి.మాదవి,మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గాదిలింగేశ్వర చిన్నబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ రామలింగప్ప పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి చేతుల మీదుగా సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వాల్మీకి సంఘం నాయకులు చాముండేశ్వరి, మస్తానప్ప, ఎల్లప్ప ,సూర్యనారాయణ,మండల కన్వీనర్ వాల్మీకి మోహన్ ,రామంజినేయులు, పాల్గొన్నారు.

సంబరాల్లో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో 3వ విడత వైయస్ఆర్ ఆసరా సంబరాలు సోమవారం ఎంపీపీ ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పెద్దారెడ్డి, బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 78.94 లక్షల స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలకు 3వ విడత వైయస్ఆర్ ఆసరా కింద 6419.89కోట్ల రూపాయలు విడుదల చేసారని, ఒక్క తాడిపత్రి నియోజకవర్గంలో మొత్తం 29.42 కోట్ల రూపాయలు , యాడికి మండలంలో 8019 మంది లబ్ధిదారులకు 3వ విడత వైయస్ఆర్ ఆసరా పథకం కింద అక్షరాలా ఏడు కోట్ల నలభైఒక్క లక్షల యేనభైయేడు వేల నాలుగు వందల పదహేడు రూపాయలు విడుదల చేసారని తెలిపారు. ముఖ్యంగా మహిళల పట్ల సీఎం జగన్ మోహన్ రెడ్డి కి చాలా అభిమానం ఉందని అందుకే కష్టకాలంలో కూడా 3 వ విడత వైయస్ఆర్ ఆసరా నిధులు విడుదల చేసి స్వయం సహాయక పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకర్ల దగ్గర నుండి ఎటువంటి వత్తిడి లేకుండా చూస్తునందుకు మహిళలు హర్షం వ్యక్తం చెస్తున్నారని తెలిపారు. ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎమ్మార్వో అలెగ్జాండర్, ఏ సి రాజ్యలక్ష్మి, ఏపీఎం చంద్రశేఖర్,మాజీ జడ్పీటీసీ వెంకటరామి రెడ్డి,సర్పంచ్ పందు అనురాధ, ఉపసర్పంచ్ కాస చంద్రమోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రాన్ని ఏం చేయాలనుకున్నారు?

ధూమపానం లేని చోట గంజాయి డ్రగ్స్ ఏంటి

దేశంలో ఎక్కడ గంజాయి పట్టుబడినా మూలాలు ఏపీలో ఉంటున్నాయి

మాజీ మంత్రి పరిటాల సునీత ఆగ్రహం

విశాలాంధ్రబ్యూరో-అనంతపురం: ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న తిరుమలను వైసిపి నాయకులు ఏం చేయాలనుకుంటున్నారో అర్థం కావడం లేదని మాజీ మంత్రి పరిటాల సునీత అనంతపురంలోని తన నివాసంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం అక్కడ పొగ తాగడం కూడా నిషేధమని అలాంటి చోట మద్యం బాటిళ్లు గంజాయి డ్రగ్స్ దొరుకుతున్నాయని ఆమె తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నిత్యం గోవింద నామం వినిపించే చోట అసాంఘిక కార్యకలాపాలు ఏంటని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల్లో ఎలాగో మీ ఆగడాలు ఉన్నాయి కనీసం తిరుమలలో అయినా మీ పాలన తీరు మార్చుకోవడం లేదంటూ ధ్వజమెత్తారు. ఇటీవల టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన మీద ఆమె తీవ్రంగా స్పందించారు. ఇది ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాల్సిన సంఘటన అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో వార్షిక నివేదిక ప్రకారం గంజాయి రవాణాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందన్నారు. దేశంలో పట్టుబడిన 7.5 లక్షల కిలోల గంజాయిలో 2021లో ఒక్క ఆంధ్రప్రదేశ్ నుంచే 26% పట్టుబడ్డాయంటే మీ పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ప్రజలకు మంచి చేయడంలో వైసిపి ప్రభుత్వం ముందు వరుసలో ఉండదని.. ఇలాంటి వాటి విషయంలో మాత్రం అగ్రస్థానంలో ఉంటుందన్నారు తిరుమలలో పవిత్రతకు దెబ్బ తీసే విధంగా ఎవరు వ్యవహరించినా.. దేవుడు శిక్షించడం ఖాయమన్నారు.



గడపగడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యలపై నివేదిక ఇవ్వండి

విశాలాంధ్రబ్యూరో-అనంతపురము: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలపై చర్యల నివేదికను వెంటనే పంపాలని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు.స్థానిక కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమం అనంతరం అన్ని శాఖల అధికారులతో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు.స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో 363అర్జీలను ప్రజల నుంచి జాయింట్ కలెక్టర్ స్వీకరించారు.జాయింట్ కలెక్టర్ తోపాటు అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్ కుమార్, డిఆర్ఓ గాయత్రిదేవి ,స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు,అన్సెట్ సిఈఓ కేశవనాయుడు, ఆర్డీఓ మధుసూదన్,జెడ్పి సీఈఓ భాస్కర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ,గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన 2708 సమస్యలకు 34 శాఖలకు సంబంధించిన అధికారులు వెంటనే ఆ సమస్యలపై తీసుకున్న చర్యల గురించి నివేదికను సిపిఓకు పంపాలన్నారు.

అందుకు సంబంధించి శాఖల వారీగా గుర్తించిన సమస్యలను జిల్లా అధికారుల వాట్సాప్ గ్రూపులో సిపిఓ పంపారన్నారు. అందులో అత్యధికంగా ఆర్డబ్ల్యూఎస్ 444, ఐసిడిఎస్ 396,డిపిఓ 383, పంచాయతీ రాజ్ 341, డిఇఓ 209, డిఎంహెచ్ఓ 173, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ 165, జడ్పీ సీఈవో 147 ,పశుసంవర్ధక శాఖ 82, వ్యవసాయ శాఖ 66, ఆర్ ఎం, ఆర్ టి సి 55 సమస్యలు ఉన్నాయన్నారు. తక్కువ సమస్యలు గుర్తించిన శాఖలు కూడా వారు తీసుకున్న చర్యల నివేదికను సిపిఓ కు పంపాలన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా రీఓపెన్ కాపాడుతున్న పిటీషన్ ను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లా అధికారులకు పంపే గ్రీవెన్స్ అన్నింటిని ఓపెన్ చేసి సకాలంలో వాటిని పరిష్కరించేలా చూడాలన్నారు.డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ పథకం విధి విధానాలకు సంబంధించి క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎంలు ఆరోగ్య మిత్రులకు పంపిణీ చేయనున్న ఆరోగ్యశ్రీ మ్యాన్యువల్ లను జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా విడుదల చేశారు. అలాగే 40 సంవత్సరాలు వయస్సు దాటిన ఉద్యోగులకు ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ద్వారా 25 రకాల దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించే స్టిక్కర్ ను కూడా జెసి,ఇతర అధికారుల చేతుల మీదుగా విడుదల చేశారు.ఈ వ్యాధులకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అనంతపురం నందు సోమవారం నుండి శనివారం వరకు ఉదయం 10 గంటల నుండి1:00 గంట వరకు చికిత్స అందించడం జరుగుతుందని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉద్యోగులు ఉపయోగించుకోవాలని జెసి తెలిపారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 28, మార్చి 2023

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-చిలమత్తూరు: మండలంలోని కొడికొండ చెక్ పోస్ట్ వద్ద సోమవారం ఏఐటీయుసి అనుబంధంగా శ్రీవినాయక ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు కనిశెట్టిపల్లి వినోద్ కుమార్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోవింద్ రెడ్డి, మండల కార్యదర్శి బాలచంద్ర ఆధ్వర్యంలో కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ అధ్య క్షులుగా నాగిరెడ్డి, కార్యర్గశంకర్, కోశాధికారిగా పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా గాలిమిషన్ శ్రీనివాసులు, గణేష్ నాయక్, మహేష్, వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా సి నాగరాజు, దేవరాజు, జి సి శ్రీనివాసులు, నరేష్కమిటీ సభ్యులుగా ఎం రామాంజినాయక్, ఈశ్వర్, సంతోష్, నాగరాజు నరసింహులు ఎన్నిక చేశారు. కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహించే ఏఐటీయూసీ సంఘం స్వతంత్ర పోరాటంలో పాల్గొన్నదని సంఘం యొక్క గొప్పతనాన్ని తెలియజేశారు.

మా భూములు కాపాడండి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: మండల పరిధిలోని మల్లేనిపల్లి గ్రామస్తులు సోమవారం మా భూములు ఎలాగైనా కాపాడాలని కోరుతూ సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి మధు ఆధ్వర్యంలో ఆర్డీవో తిప్పే నాయక్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మధు మాట్లాడుతూ కొందరు అధికార పార్టీ నాయకుల యొక్క ఆగడాలు భూ దౌర్జన్యాలతో పేదలకు అన్యాయం జరుగుతోందని, అధికారం ఉందని వైసిపి నేతలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పేదల సలాలను భూములను కాజేస్తుండడం దారుణం అన్నారు. సర్వేనెంబర్ 84-3.89.90 లకు నోటీసులు అధికార పార్టీకి చెందిన వెంకటేష్ పంపించడం జరిగింది అని ఎక్కడ విలువైన స్థలాలు కనిపిస్తాయో వాటిపై కన్నేయడం, వాటికి నకిలీ పట్టాలు సృష్టించి అమ్మేయడం లాంటివి ధర్మవరం ఎమ్మార్వో కార్యాలయమే అడ్డగా మారిందని తెలిపారు. దీనివల్ల పేదల తమ స్థలాలను కాజేస్తున్నప్పటికీ వారిని ఎదిరించలేక మిన్నకుండిపోతున్న పరిస్థితి నేడు కలిగిందన్నారు. నకిలీ పట్టాలు సృష్టించి పేదల భూములను ఏదేక్షగా విక్రయిస్తున్న స్థానిక రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నా కూడా అధికార పార్టీ నాయకులకు మద్దతు తెలపడం సమంజసం కాదని వారు తెలిపారు. కావున ఆ సర్వే నెంబర్ పై విచారణ జరిపి మల్లీ గ్రామస్తులకు న్యాయం చేయవలసినదిగా వారు డిమాండ్ చేశారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల పరిధిలోని దొరిగిల్లు గ్రామంలో సోమవారం డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో 60 సంవత్సరములు పైబడిన అవ్వ తాతలకు కంటి పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా 74 మందికి పరీక్షలు నిర్వహించగా ఇందులో 36 మందికి కంటి అద్దాలు, 12 మందికి కంటి ఆపరేషన్లు, 26 మందికి కంటి చుక్కల మందు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాములు, సి హెచ్ ఓ భారతి, హెల్త్ అసిస్టెంట్ నాగ రాజు, హెల్త్ సెక్రటరీ చక్రి, ఆశా కార్యకర్త ఉమా లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎన్ఎంఎస్ఎస్‌కు విద్యార్థి ఎంపిక

విశాలాంధ్ర-మడకశిర: గుడిబండ మండలం ఎస్. రాయపురం పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న గగన్ జాతీయ ఉపకార వేతనానికి ఎంపికైనట్లు సోమవారం హెచ్ఎం మారుతి తెలిపారు. ప్రతి ఏడాది ఈ పాఠశాల నుంచి ఉపకార వేతనానికి ఎంపికైతున్నారని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ విద్యార్థి మండల స్థాయిలో ద్వితీయ స్థానంలో మార్కులు సాధించి జాతీయస్థాయి ఉపకార వేతనానికి ఎంపిక అయ్యారని ఉపాధ్యాయులు విద్యార్థులు విఆర్ గగన్ ను అభినందించారు.

ఘనంగా సరస్వతీ పూజ

విశాలాంధ్ర-పెనుకొండ: నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులు సరస్వతీ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, సహ ప్రధాన ఉపాధ్యాయులు వేణుగోపాలచార్యులు పాల్గొని విద్యార్థులు క్రమ శిక్షణ కలిగిన విద్యను అభ్యసించాలని, అన్నిటి కంటే తమ యొక్క ప్రవర్తనను సక్రమ మార్గంలో ఉంచుకున్నప్పుడు విద్యార్థులు అత్యున్నత స్థాయి ఎదగడానికి మార్గము సుగమవుతుందన్నారు. అనంతరం వారందరికీ ఏప్రిల్ మూడో తారీకు నుంచి జరిగే పదవ తరగతి పరీక్షల హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట శ్రీనివాసులు, అక్కమ్మ, గిరిజమ్మ, చాంద్ బాషా, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను మోసం చేస్తే సహించం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: వాల్మీకులను బోయలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మోసం చేస్తే సహించేది లేదని రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకులు గోట్లూరు చంద్ర పేర్కొన్నారు. ఈ సంద ర్భంగా సోమవారం ప్రెస్క్లబ్లో వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టిలో చేర్చే విషయం కొత్తేమీ కాదన్నారు. రాయల సీమ జిల్లాలను ఎస్టీల నుంచి బీసీ లోకి కన్వర్ట్ చేసి ఏ కమిషన్, ఏ విచారణ,ఏ జీవో లేకుండా రాజ్యాంగ ఉల్లంఘన చేసి, బోయలకు ద్రోహం చేయడం జరిగిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ సాకే మద్దిలేటి, ఏపీ వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షులు బోయ సాంబ, జింకల రాజన్న, పూజ మొబైల్ సాయి ,జయరాం, వాల్మీకి నగర బత్తలపల్లి మండల అధ్యక్షులు సాకే గోపాల్, కుర్లపల్లి మోహన్, ముస్తూరు నాగార్జున, పలువురు వాల్మీకి సంఘం నాయకులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి

విశాలాంధ్ర-పుట్టపర్తి: పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని సత్య సాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మొదటిరోజు పుట్టపర్తి ఆర్డీవో కార్యాలయం ముందు సామూహిక దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేమయ్య యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రానికి వరప్రసాదిని అయిన పోలవరం ఎత్తు తగ్గించే కేంద్ర ప్రభుత్వ కుట్రలను ఖండిస్తున్నామన్నారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించి, కేంద్రప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించకుండా .45.72 మీటర్ల ఎత్తుతో పూర్తి స్థాయిలో నిర్మించాలన్నారు. జాతీయ ప్రాజెక్టు పోలవరం మినీ ప్రాజెక్టుగా మారుతుందన్నారు. దీనివలన ప్రాజెక్టు నీటినిల్వ 196.60టిఎంసి ల నుండి 92టిఎంసిల కె పరిమితం కానుందన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే 7.20లక్షల ఎకరాల సాగునీరు అందుతుందన్నారు. 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు. రాయలసీమ ప్రాజెక్టులైన గాలేరు,నగరి,హంద్రీనీవాలాంటి ప్రాజెక్టులకు కొంతమేరకు నికరజలాలు కుడి, ఎడమ కాలువలద్వారా 534గ్రామలకు తాగునీరు వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పోలవరం మొదటి దశ, మలిదశ అనే మెలిక

పెట్టకుండా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ముఖ్యమంత్రి తక్షణం స్పందించి చొరవ తీసుకుని అఖిలపక్ష సమావేశాన్ని నిర్మించాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు బయన్న, అంజి.కదిరప్ప.కుల్లాయప్ప , మహిళాసమాఖ్య జిల్లా కన్వీనర్ జయలక్ష్మి, సిపిఐ మండల కార్యదర్శులు వెంకటనారాయణ, చలపతి.ఈశ్వరయ్య, రమణ, షెక్ షా.రేడ్డెప్ప నాయకులు బాషా.లీలా .జ్యోతి.బోరింగ్ రమణ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యలతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - అగళి : ఆహారం లో విరివిగా చిరుదన్యాలను వాడి భూజించడం తోనే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండచ్చని ఐసిడిఎస్ సూపెర్వైజర్ లీలావతమ్మ సూచించారు. మండల పరిధిలోని ఇరిగేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ లీలావతమ్మ ఆధ్వర్యంలో విద్యార్థులకు పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమాంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు అనంతరం పాంశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారితకు ఆసరా

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ లోని వంశిక కళ్యాణ మండపం నందు జరిగిన వైయస్ఆర్ ఆసరా పథకం కింద మూడో విడత సాయాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి జమచేసిన సందర్భంగా, మూడో విడత సాయాన్ని పొందిన అక్క చెల్లెమ్మలతో కలిసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి, మెగా చెక్క ను అందజేసిన, నియోజకవర్గ శాసనసభ్యులు మాలగుండ్ల శంకర నారాయణ ఎమ్మెల్సీ మంగమ్మ , జడ్పీ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని మూడవ విడత కింద 454 సంఘాలకు గాను సోమవారం 3,04,18,850 రూపాయల మెగా చెక్కులు పంపిణీ చేశారు. మహిళా సాధికారతకు వైఎస్ఆర్సిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని వక్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ పట్టణ మరియు మండల ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతో ఉపాధి లేని యువతపై సర్వే

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎస్కే యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ శాఖ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపును గో ట్లూరు గ్రామములో 25వ తేదీ నుండి 31 వ తేదీ వరకు "విద్యతో ఉపాధి లేని యువతతో సర్వే చేయడం" జరుగుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గోపాల్ నాయక్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం ఈ సర్వే ఆధారంగా 15 సంవత్సరాల నుండి 29 సంవత్సరాల మధ్య యువతపై సర్వే చేశామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తోపాటు అధ్యాపకులు షమీవుల్లా, ఆనందు, రామ మోహన్ రెడ్డి లు పాల్గొన్నారు.

సభ్యత్వాన్ని రద్దు చేయడం దారుణం

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: ప్రస్తుత ఎంపీ రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రకటించడం దారుణమని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అంబేద్కర్ సర్కిల్ వద్ద కరపత్రాలను విడుదల చేసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. తదుపరి వారు మాట్లాడుతూ భారత దేశాన్ని వందల సంవత్సరాల బ్రిటిష్ బానిసత్వం నుండి విముక్తి కలిగించి దేశ ప్రజానీకం కోసం దేశ అభివృద్ధి కోసం ప్రాణాలను అర్పించి 75 సంవత్సరాల స్వాతంత్య భారతావనిని ప్రపంచ అగ్ర రాజ్యాల సరసన కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిందన్నారు. అయితే దేశ ప్రధాని మోడీ ఒకవైపు దేశ సంపదని కొల్లగొడుతున్నారని మరోవైపు హిందుత్వం పేరుతో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నారని వారు మండిపడ్డారు. రాష్ట్ర కార్యదర్శి నరేంద్ర, నాయకులు చైతన్య, గణేష్, సాయి పాల్గొన్నారు.

బాధితులకు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: ఈనెల 17న బత్తలపల్లి మండలం కోట్ల మర్రి వద్ద ఆటో బొలేరో వాహనం ఢీకొన్న ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ఒక్కొక్క కుటుంబానికి 5 లక్షల చొప్పున ఆరుగురికి 30 లక్షల విలువ చేసే శకులను ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరెడ్డి వారి స్వగృహంలో పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి బాధితులతో మాట్లాడుతూ చిరు వ్యాపారులు కూలీలు మృతి చెందడం నన్ను ఎంతగానో కలిసివేసిందని తెలిపారు. సంఘటన తెలిసిన వెంటనే సహాయక చర్యలు వేగవంతంగా చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. ఇదే అదునుగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వారు అప్పటికప్పుడే స్పందించి సహాయ నిధి కింద ఒక్కొక్క కుటుంబానికి ఐదు లక్షల చొప్పున సాయం విడుదల చేయడం పట్ల వారు కృతజ్ఞతలు తెలియజేశారు. బాధిత కుటుంబాలకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీవై చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎర్రగుంట భాగ్యలక్ష్మి, కౌన్సిలర్, మాజీ వైస్ చైర్మన్ చందమూరి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసూళ్ల చైర్మన్!

తవ్విన గుంతలు లోయలుగా మారిన వైనం

ఒత్తిళ్లతో బలవంతపు సంతకాలు

హై డ్రామా గా మారిన నాడు నేడు పనులు

పనులు చేకుండానే బిల్లులు

విశాలాంధ్ర-లేపాక్షి: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామీణ ప్రాంతాలలోని విద్యాలయాలను ప్రశాంత వాతావరణంగా తీర్చిదిద్దడానికి నాడూ నేడు పథకం కింద నిధులు మంజూరు చేస్తే పనులు చేయనిదే పైసా వసూలు చేసి చైర్మన్ వసూల్ మెన్ గా మారిన సంఘటన చోళ సముద్రం జడ్పీ హైస్కూల్లో చోటుచేసుకుంది. పాఠశాలలో విద్యార్థులకు సరిపడ గదులు లేకపోవడంతో సంబంధిత అధికారులు ప్రభుత్వానికి నిధులు మంజూరు చేయాలని. నివేదిక పంపడంతో 3 గదుల నిర్మాణానికి 36 లక్షలు నాడు నేడు పథకం కింద నిధులు మంజూరు చేశారు. ఈ పనులను పాఠశాల చైర్మన్ చెన్న కృష్ణ పనులను ప్రారంభించాడు. అయితే 2022 జులై నెలలోనే మార్కింగ్ చేసిన పిల్లర్ గొంతులు తవ్వి 8 లక్షల 20వేలకు పైగా బిల్లును చెన్న కృష్ణ డ్రా చేయడం జరిగింది. దీని పట్ల పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. తవ్విన గుంతలో ఆరు నెలలు కావడంతో వర్షపు నీరు వచ్చిన సమయంలో ఆ గుంత లు ఇప్పుడు యమలోఎల్లా మారి చదువుకునే విద్యార్థులను భయపెడుతున్నాయి. అయితే నిర్మాణానికి కొద్ది వరకు మెటీరియల్ నిర్మాణావరణంలో కనబడినప్పటికీ

పనులు చేయందే బిల్లులు ఎలా వసూలు చేస్తారని పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఎప్పుడో మొదటి విడతలో జరిగిన పనులకు మెటీరియల్ ఉంచడానికి తీసుకున్న ల్యాబ్ రూమ్ కూడా ఇంతవరకు పాఠశాలకు అప్పగించకపోవడం పట్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గదిలోనే ల్యాబ్ సౌకర్యాలు గతంలో ఉండేవని పాఠశాల సిబ్బంది తెలియజేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్చుకునే విద్యార్థుల విద్యాలయానికి పెద్దగా ఉండాల్సిన చైర్మన్ చిన్నకృష్ణ ఇలాంటి వాటికి పాల మాలితే పాఠశాల ఎలా అభివృద్ధి జరుగుతుందో సంబంధిత అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఒత్తిళ్ళ తాళలేక సంతకాలు చేశాం... చోళ సముద్రం జెడ్పీ హైస్కూల్....

ప్రధానోపాధ్యాయురాలు సుధామణి...గత ఆరు నెలలుగా పనులు చేయాలని చైర్మన్ ను ఎంత డిమాండ్ చేసిన పనులు చేయలేదని, నాపై ఒత్తిళ్లు చేసి సంతకాలు చేయించారని. ప్రశ్నిస్తే ఇసుక ఇటికలు ఇనుము సిమెంట్ తదితర మెటీరియల్ గాను ఒత్తిళ్లు చేసినప్పుడు 8 లక్షలు బిల్లుల మంజూరుకు రికార్డు చేసి డబ్బులు డ్రా చేయడం జరిగిందని ఆమె తెలిపారు. సంబంధిత అధికారులతో పాటు తాను పనులు చేస్తున్న చైర్మన్ చిన్నకృష్ణను పనులు చేయమని ఎన్నోసార్లు ఒత్తిడి చేశామన్నారు. ఈ విషయం మండల జిల్లా స్థాయి అధికారులు కూడా తెలిపామని ఆమె పేర్కొన్నారు.స్పందనలో విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు....చోళ సముద్రం పాఠశాలలో పనులు చేయకుండా లక్షల రూపాయల బిల్లును డ్రా చేసి పాఠశాల పనులను నిర్లక్ష్యం చేసిన పాఠశాల చైర్మన్ చెన్న కృష్ణ పై చర్యలు తీసుకోవాలని. చోళ సముద్రం విద్యార్థుల తల్లిదండ్రులు పుట్టపర్తి లోనే జిల్లా కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేశారు.

బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్తచెరువులోనే మేజర్ గ్రామ పంచాయతీలోనే గతంలో పంచాయతీ గదులకు వేలంపాటలో దక్కించుకొని బాడుగలు చెల్లించని వారిపై జిల్లా పంచాయతీ అధికారుల వారే నిబంధనల మేరకు చట్టరీత్యా పోలీసులకు ఫిర్యాదు చేసి నమోదు చేయడం జరుగుతుందని గ్రామపంచాయతీ కార్యదర్శి గోపాల్ తెలిపారు. గదులు నెంబర్లు 14, 21, 28, 24, 37, 45 ఈ గదులకు బాడుగలు చెల్లించలేదని, బకాయిలు 17 లక్షల 72,900 బకాయిలు ఉన్నదన్నారు. పలుమార్లు చెల్లించాలని కోరిన చెల్లించలేదన్నారు. దీనితో ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తామన్నారు.

నారా లోకేష్, మాజీ మంత్రి ని విమర్శించే స్థాయి లేదు

విశాలాంధ్ర-బుక్కపట్నం: తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి లను విమర్శించే అర్హత స్థాయి వైసిపి పుట్టపర్తి మహిళా కౌన్సిలర్ సాయి లీల కు లేదని హిందూపురం తెలుగు మహిళ పార్లమెంట్ కార్యదర్శి మాధవి, తెలుగు మహిళా అధ్యక్షురాలు లావణ్య గౌడ్ తెలిపారు. పాదయాత్రలో భాగంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులను పిచ్చికుక్కతో పోల్చడం సరికాదని తెలుగుదేశం నాయకులను విమర్శించే ముందు తమరి స్థాయి ఏమిటో తమరి అర్హత ఏమిటో తెలుసుకొని విమర్శించాలని బహిరంగ సభలో నారా లోకేష్ మాట్లాడిన మాటలు వాస్తవం కాదా అని ప్రశ్నించారు. టిడిపి నాయకులను విమర్శం నుంచే ముందు తమకున్న అర్హత ఏంటో తెలుసుకొని మాట్లాడాలని తమరి చరిత్ర ప్రజలందరికీ తెలుసు ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పుట్టపర్తిలో ఎవరు అరాచకం చేస్తున్నారో ప్రజలందరికీ తెలుసునని ప్రశ్నించారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ప్రజలకు నిత్యము అందుబాటులో ఉన్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ని విమర్శిస్తే తెలుగుదేశం పార్టీ నాయకుల పైన ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకొని అర్హత స్థాయి బట్టి మాట్లాడాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు మహిళలు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్టాపన

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండలం లోని చిన్న బాబయ్య పల్లి గ్రామంలో సీతారామ లక్ష్మణ హనుమద్ దేవతా విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం నాడు అంగరంగ వైభవంగా జరిగింది. మొదట గంగపూజ, గోపూజ, మంగళ వాయిద్యాలతో యాగశాల ప్రవేశం చేసి సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెనుగొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ బంధువులు పాల్గొని, ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించి ఆలయానికి లక్ష రూపాయలు విరాళం అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాములను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, హిందూపురం మున్సిపల్ చైర్మన్ ఇంద్రజ, సోమందేపల్లి మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ఎంపీపీ గంగమ్మ వెంకటరత్నం, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, భక్తులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

కుటుంబ వైద్య విధానం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-రొద్దం: సత్యసాయి జిల్లా మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ జగదీష్ బాబు సిబ్బందితో కలిసి సోమవారం బొక్కసంపల్లి గ్రామంలో కుటుంబ వైద్య విధానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పెనుగొండ డివిజన్ వైద్యాధికారి సిహెచ్ మంజువాణి ఆకస్మిక తనకి నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తో కుటుంబ వైద్య విధానం కార్యక్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని, వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి తెలియజేయాలని సిబ్బంది సూచించారు. పి హెచ్ ఎం న్ లక్ష్మీ నరసమ్మ, సూపర్వైజర్ ఆలివేలమ్మ, గిరినాథ్ రావు, డి ఎం హెచ్ ఓ కార్యాలయం సిబ్బంది, ఆపరేటర్ హేమలత, అటెండర్ సుధాకర్, సచివాలయ ఏఎన్ఎం రమాదేవి, ఆరోగ్య సహాయకులు రవికుమార్, ఆశవర్కర్లు పాల్గొనడం జరిగింది.

కౌన్సిల్ సమావేశానికి హాజరుకండి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: పురపాలక సంఘ కార్యాలయంలో ఈనెల 29వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశమును నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ లింగం నిర్మల, పురపాలక సంఘ కమిషనర్ మల్లికార్జున సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అజెండాలోని 76 అంశాలపై చర్చించి తీర్మానంతో ఆమోదం చేయడం జరు గుతుందని వారు తెలిపారు. కావున కౌన్సిల్ సభ్యులు అందరూ కూడా సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నారా లోకేష్ యువ గళం పాదయాత్రకు ఘన స్వాగతం

ఐదు చోట్ల గజమాలలతో, పంజాబీ డప్పులతో స్వాగతం పలికిన తెలుగు తమ్ముళ్లు

నారా లోకేష్ కు వడ్డెర్ల సమస్యలపై వినతి

విశాలాంధ్ర-గోరంట్ల : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు నారా లోకేష్ 52వ రోజు చేపట్టిన యువ గళం పాదయాత్ర గోరంట్ల మండలంలో సోమవారం రెండవ రోజు సాగింది, ఈ సందర్భంగా మొదటి రోజు ఆదివారం రెడ్డి చెరువు కట్ట వద్ద ఏర్పాటుచేసిన విడిది కేంద్రంలో బస్సు చేశారు, ఉదయం 9 గంటలకు ప్రారంభించిన పాదయాత్ర రెడ్డి చెరువు కట్ట, కొండాపురం క్రాస్, మరవ పల్లి, చలమయ్య గారి పల్లి, చింతలపల్లి, జీనం వాండ్లపల్లి తిప్పరాజు పల్లి కసిరెడ్డిపల్లి హరిజనవాడ మీదుగా గోరంట్లకు చెరుకుని గుమ్మయ్య గారి పల్లి క్రాస్ వద్ద ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని క్రాస్ దాటగానే ఏర్పాటుచేసిన విడిది కేంద్రంలో రెండవ రాత్రి బస చేశారు, ఈ సందర్భంగా మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, కాలవ శ్రీనివాసులు, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ జెడ్పీ చైర్మన్ పూల నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత, బండారు శ్రావణి, పరిటాల శ్రీరామ్, నిమ్మల అంబరీష్, తదితరులు పాదయాత్రలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా మరవ పల్లి వద్ద టిడిపి మాజీ ఎంపీటీసీ వెంకట రంగారెడ్డి గజమాలతో ఘనంగా స్వాగతం పలికి బాణసంచా పేల్చారు, అలాగే చలమయ్య గారి పల్లి వద్ద వడ్డెర్ల సమస్యలపై నారా లోకేష్ కు మాజీ మండల ఉపాధ్యక్షుడు రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో కులస్తులు వినతిపత్రం సమర్పించారు, తమకు ఎలాంటి రుణాలు పనిముట్లు అందలేదని, అన్ని రకాల ప్రభుత్వ పథకాలను వర్తింపచేయాలని తమను ఆదుకొని తమ కుటుంబాలకు భరోసా ఇవ్వాలని కోరారు, అదేవిధంగా నిమ్మల కృష్ణప్ప ఇంటి ఎదుట ఎల్ ఎన్ నారాయణస్వామి ఆధ్వర్యంలో 140 కేజీల యాపిల్ పండ్ల హారంతో ఘన స్వాగతం పలికారు, గాంధీ విగ్రహం వద్ద టీడీపీ సీనియర్ నాయకులు జయరామ్,వేణు లు గజమాలతో సన్మానం చేశారు, అలాగే డాన్స్ బాలాజీ గజమాలతో సత్కరించారు, అనంతరం సామాజిక సేవకులు టిడిపి మైనార్టీ నాయకులు ఉమర్ ఖాన్ ఆధ్వర్యంలో గులాబీ పూల గజమాల తో పాటు పంజాబీ డాన్స్ తో వినూత్నంగా నారా లోకేష్ కు ఘన స్వాగతం పలికి సంబరాలు నిర్వహించారు, అలాగే స్టేట్ బ్యాంక్ సర్కిల్ వద్ద టీడీపీ మాజీ వార్డ్ మెంబర్ శ్రీనివాసులు గజమాలతో స్వాగతం పలికారు, పట్టణంలో పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు చేరుకోవడంతో కిటకిటలాడింది, ప్రజలను అభివాదం చేస్తూ పాదయాత్రను నారా లోకేష్ కొనసాగించారు, ఈ సందర్భంగా పాదయాత్రలో ప్రజలు ఎవరు ఎలా ఇబ్బందులు పడకుండా వాటర్ ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, భోజన సౌకర్యాన్ని కల్పించారు, పాదయాత్రలో టిడిపి శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న మహిళ నేత

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం లోని గోరంట్లలో సోమవారం జరుగుతున్న యువ నాయకుడు చేపట్టిన యువగలం పాదయాత్రకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆమె ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న ఐదు మండలాల్లోనూ అనేకమంది మహిళలు భారీ ఎత్తున పాదయాత్రలో

పాల్గొన్నారు. ఆమె నారా లోకేష్ వెంబడి పాదయాత్ర చేయడం ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సవితమ్మ నాయకత్వం వర్ధిల్లాలని, తెలుగు యువత నాయకులు అనేకమంది ఆమె నాయకత్వాన్ని బలపరచాలని సంఘీభావంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి పార్థసారథి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ప్రజా ప్రతినిధులు, గోరంట్ల మండల ప్రజా ప్రతినిధులు, పెద్ద ఎత్తున మహిళలు యువకులు యువ నాయకులు పాల్గొన్నారు.

భారీ జన సమీకరణ

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ నియోజకవర్గం లోని గోరంట్ల మండలం నందు సోమవారం యువ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర 52వ రోజు జరుగుతున్నందున తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత ఆమె భర్త వెంకటేశ్వరరావు యువగళం పాదయాత్ర విజయవంతం కావడానికి నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లోని కార్యకర్తలను, నాయకులను భారీ జన సమీకరణ చేశారు. అలాగే వచ్చిన ప్రజలందరికీ వేసవికాలం దృష్టిలో ఉంచుకొని వాటర్ బాటిల్స్ భోజన ఏర్పాట్లు చేశారు. యువ గళం పాదయాత్రకు విచ్చేసిన వారందరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అనేక గ్రామాలకు కార్యకర్తలను తరలించడానికి సొంత నిధులతో వాహనాలు ఏర్పాట్లు చేయడం జరిగినది.

ధ్వజస్తంభం ప్రతిష్ట

విశాలాంధ్ర -చెన్నే కొత్తపల్లి: మండలంలోని గంగినేపల్లి గ్రామంలో సోమవారం ఓబులేసు స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట కార్యక్రమాన్ని పూజారి ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో హోమం నిర్వహించారు. తదుపరి ధ్వజస్తంభ ప్రతిష్ట గావించారు. ఈ కార్యక్రమానికి గంగినేపల్లి చుట్టుప్రక్కల గ్రామాల నుండి పలువురు భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారి హోమం పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ పూజ

విశాలాంధ్ర-అమడగూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సోమవారం సరస్వతీ దేవి పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానో పాధ్యాయులు రమణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.